# వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



-పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
-తల్లాడ మండలంలో కలెక్టర్ విపి గౌతమ్ విస్తృత పర్యటన

2 లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 28 | మార్చి | 2024
పేజీలు 7

# అక్కరకు రాని కష్టం..
# పని చేసినా చేతికందని రొక్కం..!

-చెల్లింపుల కోసం ఉపాధి కూలీల ఎదురుచూపు
-ఉపాధిలోనూ శ్రమ దోపిడీ




కరువు కాలంలో కుటుంబాలను పోషించుకునేందుకు వ్యవసాయ పనులు దొరక్క ఉపాధి హామీ పనికి వెళితే నెలలు గడిచినా చెల్లింపులు లేక పేద కుటుంబాలు అల్లాడుతున్నాయి. కష్టం చేసినా అక్కరకు రాని దయనీయ స్థితి వారిది. తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు సుమారు రూ. 1098.51 కోట్లు చెల్లించాల్సి ఉంది. గత నవంబరు మాసం నుండి చెల్లింపులు జరగడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు.

మెయిన్‌లో..

-ప్రజాపక్షం/ఖమ్మం

## ఎన్నికల కోడ్ అమల్లోనూ మద్యం దందా..!





సెంటర్‌స్ప్రెడ్

## పూట గడవని స్థితిలో ఆటో డ్రైవర్లు..!



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టులు మృతి





ప్రజాపక్షం/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బుధవారం ఉదయం చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనతో మరోసారి నాలుగు

మిగతా 2లో..

- లోక్‌సభ ఎన్నికల వేళ అలజడి
- తిప్పికొడుతున్న భద్రతా బలగాలు
- వరుస ఘటనలతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి
- నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో హై అలెర్ట్

# ఎలా చేశారు.. ఎన్ని చేశారు..?

వైరా రిజిస్ట్రార్ కార్యాలయ విచారణకు డిఐజి ఆదేశాలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా సబ్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్

-బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా రిజిస్ట్రార్
-ప్రజాపక్షం కథనానికి స్పందన

ప్రజాపక్షం/ వైరా : వైరా రిజిస్ట్రార్ కార్యాలయంకు సంబంధించి తీగ లాగితే డొంక కదిలినట్లయింది. వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ ధనార్జనే ధ్యేయంగా రిజిస్ట్రేషన్లు జరిగిన విషయాన్ని ప్రజాపక్షం వరుస కథనాలతో వెలికి తీసింది. ప్రజాపక్షం కథనాలపై ప్రాథమిక విచారణలో నూటికి నూరు పాళ్లు నిజమేనని తేలడంతో అధికారులు పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. స్టాంప్ రిజిస్ట్రేషన్ల శాఖ వరంగల్ డిఐజి సుభాషిణి వైరా రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న చట్టవిరుద్ధ రిజిస్ట్రేషన్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఖమ్మంజిల్లా రిజిస్ట్రార్

మిగతా 2లో..

# ఎలా చేశారు.. ఎన్ని చేశారు..?










**(మొదటిపేజీ తరువాయి)**

అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. బుధవారం జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్ వైరా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి 2023 డిసెంబరు నుంచి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల పై వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఏన్కూరు మండలంలో 1/70 చట్టం అమలులో ఉండగా 1/70 నిబంధనలను పట్టించుకోకుండా కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేశారని ప్రశ్నించారు. ఉమ్మడి ఆస్తిని విభాగాల పేరుతో రిజిస్ట్రేషన్లు చేస్తున్న వ్యవహారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు దళారులను పెట్టుకుని రుణాల పేరుతో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వినవస్తున్నాయి. వైరా , కొణిజర్ల మండలాల్లో కూడా లేఅవుట్ లేని స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ కరుణను జిల్లా అధికారులు ప్రశ్నించారు. పలు రికార్డులను పరిశీలించారు. త్వరలోనే వీటన్నింటిపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలను ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా నష్టపోయిన వారు విచారణ విషయం వెలుగు లోకి వచ్చి ఉన్నతాధికారులకు తమ బాధను మొరపెట్టుకునేందుకు సిద్దం కాగా జిల్లా రిజిస్ట్రార్ విచారణకు రావడంతో అక్రమార్కులకు తప్పుడు పద్దతుల్లో రిజిస్ట్రేషన్లు చేసిన వారిలో ఆందోళన మొదలైంది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



**(మొదటిపేజీ తరువాయి)**

రాష్ట్రాలు అలెర్ట్ అయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లా బాస గూడ అటవీ ప్రాంతంలోని బికుర్‌బత్తి, పుస్‌బాక అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతి చెందిన మావోయిస్టులు ఏసిఎం సభ్యుడు నగేష్, మిలీషియా సభ్యుడు వికాస్, మిలీషియా కమాండర్ సుక్కా, మిలీషియా కమాండర్ సుక్కా, ఏసిఎం సభ్యురాలు సోని, ఏసిఎం సభ్యురాలు గంగా గా ఆ రాష్ట్ర పోలీసులు గుర్తించారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉన్నాయని తెలిపారు. తాల్పేరు నది సమీపంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే పక్కా సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్ బలగాలు అడవుల్లో గాలింపుల చర్యలు మొదలుపెట్టాయి. నదీ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టుల అలకిడి రావడంతో ఆ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టాయి. ఈ విషయాన్ని పసిగట్టిన మావోయిస్టులు ఒక్క సారిగా భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఆత్మరక్షణ కోసం జవాన్లు సైతం కాల్పులు జరిపారు. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటల పైగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. సంఘటనా స్థలం వద్ద ఆరు మావోయిస్టు మృత దేహాలు లభ్యం కాగా, వారిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. సంఘటనా ప్రాంతం నుండి మందుగుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం, వంటపాత్రలు, తుపాకులను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఘటన అనంతరం మావోయిస్టులు సమీప అడవుల్లోనికి జారుకోవడంతో వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈనెల 25వ తేదిన మావోయిస్టులు ఆ సమీప ప్రాంతంలో ముగ్గురు పౌరులను హతమార్చారు. లోక్‌సభ ఎన్నికల వేళ మావోయిస్టు పార్టీ అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు పక్కా సమాచారంతో బలగాలు తిప్పికొడుతున్నాయి.

**వరుస ఘటనలు...**

పార్లమెంట్ తో పాటు ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ మావోయిస్టులు అలజడి సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. వరుస ఘటనలతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. గత వారం రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దుల్లో నలుగురు మావోయిస్టులను చాకచక్యంగా భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. షరతులతో కూడిన చర్చలకు సిద్దమని మావోయిస్టు పార్టీ ఈ మధ్యకాలంలో ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రికి లేఖను సైతం రాసింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర భద్రతా బలగాలు మావోయిస్టు పార్టీని ఏరివేసేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం అడవుల్లోనికి పెద్ద ఎత్తున బలగాలను మోహరిస్తోంది. వేసవిలో చెట్ల ఆకులు రాలి పలుచబడుతున్న తరుణంలో మావోయిస్టుల ఉనికిని సులువుగా కనిపెట్టి మట్టుపెట్టవచ్చేనే ఆలోచనలతో బలగాలు అధునాతన ఆయుధాలతో అడవులను జల్లెడ పడుతోంది. మరో ప్రక్క మందు పాతరలు అమర్చి ఉంటారనే అనుమానంతో అడవుల్లోని ప్రతీ కాలిబాటను క్షుణ్ణంగా పరిశీలిస్తూ కూబింగ్ ముమ్మరం చేస్తున్నాయి.

**సరిహద్దుల్లో హై అలెర్ట్ ...**

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల సరిహద్దుల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ఎన్నికల వేళ నిఘా పెంచిన బలగాలు, ఈ ఘటనతో మరింత అప్రమత్తమయ్యాయి. వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. అడవుల్లోనుండి బయటకు వచ్చే రహదారులు, నదీ తీరాల వెంట నిఘా పెంచారు. మావోయిస్టు కొరియర్ల విషయంలో ఆరా తీస్తున్నారు. మావోయిస్టులకు సహకరిస్తే చట్ట రిత్యా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** పల్లె దవాఖానాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టర్ విపి గౌతమ్ తల్లాడ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని గొల్లగూడెం, తెలగవరం, అంజనాపురం, మల్సూరుతండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మిట్టపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె దవాఖానాలో ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. షుగర్, బిపి వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల మందులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ఎంత మంది పిల్లలకు ఇచ్చింది ఎంత మందికి ఇవ్వాల్సి ఉంది అడిగి తెలుసుకున్నారు. పాము, కుక్క కాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈడిడి చార్ట్ ప్రదర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ వంటి సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాల్లో కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్‌ను వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే లోకేషన్‌లో ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట రద్దీ, భద్రతా సమస్యలు తలెత్తకుండా వేర్వేరు బ్లాకుల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం లోపల ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులతో విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అనుభవ మైన ఉపాధ్యాయులు, ఆంగ్ల మాధ్యమంలో బోధన తదితర వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్సూరు తండాలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కొంత సేపు వారితో ముచ్చటించి ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఎస్‌ఈ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, విద్యాశాఖ ఇఇ నాగశేషు, తహసీల్దార్ రవికుమార్, ఎంపిడివో చంద్రమౌళి, ఇరిగేషన్ డిఈ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 15 లోగా వసతుల కల్పన పూర్తి చేయాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులు ఏప్రిల్ 15 లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మన ఊరు మన బడి, ఎస్డిఎఫ్ క్రింద కవర్ గాని 380 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద సౌకర్యాల కల్పనకు మంజూరులు ఇచ్చామన్నారు. ఇందులో 74 ఉన్నత, 306 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇట్టి 380 పాఠశాలల్లో 542 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. 276 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 78 పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలు మంజూరు చేయగా 19 చోట్ల పనులు పూర్తి కాగా 29 చోట్ల ప్రగతిలో ఉన్నాయన్నారు. ఎల్ఇడి లైట్లు, గదికి కనీసం రెండు ఫ్యాన్లు ఏర్పాటు ఉండాలన్నారు. మరుగుదొడ్లు వాడుకలో ఉండి రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట వీధి లైట్ల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేరే వేరే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెయింటింగ్ అవసరం ఉన్నచోట చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 23 నాటికి పాఠశాలలు సెలవు దినాలు ప్రారంభమవుతాయని అప్పుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరని కావున ఏప్రిల్ 15 లోగానే పనులు పూర్తయ్యేలా పకడ్బందీ కార్యాచరణ చేయాలన్నారు. విద్యుద్దీకరణకు సంబంధించి వ్రేలాడే వైర్లకు పైపింగ్ చేపట్టి నీట్‌గా పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో కేవలం ఎన్నికల వసతుల్లాగా కాగా శాశ్వత ప్రాతిపదికన వసతుల కల్పన చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పిల్లలు పాఠశాలలకు వచ్చినప్పుడు పాఠశాలల రూపురేఖలు చూసి సంతోషపడతారని, పిల్లల నమోదులు పెరుగుతాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధుల ఉత్తర్వులు జారీ చేసినట్లు అట్టి ఉత్తర్వులు గురువారం లోగా సంబంధిత సిబ్బందికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల, ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శిక్షణా కేంద్రం వద్దే ఎన్నికల విధుల సిబ్బందికి ఫారం 12 పోస్టల్ బ్యాలెట్లు, ఫారం 12 ఎ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, పిఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్, ఆర్‌అండ్‌బి పిఆర్, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖల ఇంజనీర్లు, మండల విద్యాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాల, శాంతి నగర్ పాఠశాలను కమిషనర్ ఆదర్శ్‌సురభి సందర్శించి అందులోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరం ఉన్న చోట రంగులు వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలన్నారు. స్వీప్ కార్యచరణలో భాగంగా కాంపౌండ్ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు రాయించాలన్నారు. భద్రతాపరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధులు సిబ్బందికి వసతికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ రాయితీకి నాలుగు రోజులే గడువు

**ఇంటి పన్ను వసూళ్ల పై దృష్టి సారించాలి**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటి పన్ను వడ్డీ పై రాయితీ గడువు నాలుగు రోజులే ఉన్నందున బిల్ కలెక్టర్లు, ప్రత్యేకాధికారులు పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్, ముస్తఫానగర్ ప్రాంతాలలో ఎక్కువ ఇంటి పన్ను ఉన్నటువంటి ఇండ్లు, స్కూళ్లకు ఆదర్శ్ సురభి వెళ్లి ఇంటి పన్ను కట్టాలని యజమానులకు సూచించారు. సకాలంలో పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. కొంత మంది తక్షణమే స్పందించి పన్నులు కట్టారు. ఇంటి పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్న ఇండ్లకు బిల్ కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు వెళ్లి వారు పన్ను కట్టేలా చూడాలన్నారు. గతేడాది, ఈ ఏడాది పన్ను కట్టకుండా ఉన్న వారి ఇండ్లకు నీటి పంపు కనెక్షన్లు తొలగించాలని సూచించారు. పాఠశాల, కళాశాల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్ భవనాలకు పెండింగ్ ఉంటే వాటిని సందర్శించి నోటీసులు ఇచ్చి స్పందించని యెడల వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోడీతోనే పారిశ్రామికాభివృద్ధి

**-ఆధ్యాత్మిక కారిడార్‌కు కృషి**
**-బిజెపి అభ్యర్థి తాండ్ర**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో పారిశ్రామికాభివృద్ధి మోడీ సర్కార్‌తోనే సాధ్యమవుతుందని బిజెపి ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోదరావు తెలిపారు. బిజెపి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియడం లేదని రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా ఇక్కడి ప్రభుత్వం చెప్పుకుంటుందని ఆయన ఆరోపించారు. బుధవారం ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎంపిగా గెలిస్తే అయోధ్య నుంచి భద్రాద్రి వరకు ఆధ్యాత్మిక కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఖమ్మం ప్రజలు కమ్యూనిస్టులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను గెలిపించారని ఒక్కసారి బిజెపికి కూడా అవకాశం ఇచ్చి చూడాలన్నారు. కొత్తగూడెం సమీపంలోని ముల్కలపల్లి మండలంకు చెందిన వాడినని ఖమ్మంజిల్లా పట్ల ప్రత్యేక అవగాహన ఉన్నదని ఒక ప్రత్యేకమైన విజన్‌తో పార్లమెంటుకు పోటీ చేస్తున్నానని ఆయన తెలిపారు. మట్టి వాసన తెలిసిన వాడినని అటు రైతులు, ఇటు ఇతరత్రా సమస్యల పట్ల అవగాహనతో వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెరిగేందుకు కృషి చేస్తానన్నారు. కొత్తగూడెంలో ఎయిర్ పోర్టు, మైనింగ్ యూనివర్సిటీ, ఎన్ఎండి స్థలంలో పరిశ్రమల స్థాపన, ఓపెన్ కాస్టు నిర్వాసితులకు న్యాయం చేసేవిధంగా కృషి చేస్తానన్నారు. బిజెపి ఐక్యంగా ఉందని ప్రజల నాడి చూస్తే ఈసారి గెలుపు తథ్యమన్న భావన కలుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొనగా తెల్దారుపల్లి గ్రామానికి చెందిన పలువురు బిజెపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# ఐకెపి సంక్షేమ పథకాలపై అధికారులు సమీక్ష



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని స్త్రీ శక్తి భవనంలో ఐకెపి సంక్షేమ పథకాలపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి నూరుద్దీన్ అప్పులు, పొదుపులు, ఆన్లైన్ లైవ్ మీటింగులు పాస్ బుక్‌లలో నిలువలు అప్‌లోడ్ చేసే విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. చిన్న సంఘాలు లైవ్ మీటింగులు నూరు శాతం ఆన్లైన్ చేసే విధానం మార్చి 31 ఆర్థిక సంవత్సరం చివరి కావున లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకు రీ కంటిలేషన్ పొదుపు అప్పు ఖాతాలను పాస్‌బుక్ నిల్వలను సరిచూసి అప్‌లోడ్ చేయాలని స్వయం సహాయక సంఘాలను లోకోస్ యాప్ లో సభ్యుల వివరాలను అనుసంధానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యాలను సరైన సమయంలో పూర్తి చేయాలని వివో ఏ లను కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఎం శ్రీనివాస్ రీజనల్ మేనేజర్ శ్రీనిధి రవీంద్ర, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. 2024 2025 సంవత్సరానికి సంబంధించి జరుగుతున్న ఈ ఎన్నికల పోలింగ్ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.30 గంటలకు ముగుస్తుంది. ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోదల్చుకున్న వారు తమ వెంట బార్ కౌన్సిల్ జారీ చేసిన ఐడి కార్డు తీసుకు రావాలని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే కొన్ని పదవులకు సంబంధించి ఏకగ్రీవం కాగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, ఎన్. శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణ కుమారి, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి లు పోటీ పడుతున్నారు. మొత్తం 850 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# ఘనంగా గణేశ్వరం పాఠశాల వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె. విజయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా వివిపాలెం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీమన్నారాయణ, వేపకుంట్ల హెచ్ఎం జి. నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల నివేదికను హెచ్ఎం సమర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగమన్నారు. గణేశ్వరం పాఠశాలలోని విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ కలిగి ఉన్నారని కొనియాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రతిభ కలిగిన విద్యార్థులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు, జ్యోతి, మజహర్, విజయలక్ష్మి , అనంత్, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి పరీక్ష కిట్లు పంపిణీ





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయితీల కార్యదర్శులకు మంచి నీటి పరీక్ష కిట్లను ఎంపీడీవో చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిలో నిల్వ ఉన్న క్లోరిన్ శాతం తెలుసుకొను పరికరంను పంపిణీ చేయడం జరిగిందని దీని ద్వారా ప్రతి రోజు మంచి నీటి పరిశుభ్రతను తెలుసుకోవచ్చని దీనివలన లాభాలు, నష్టాలను అధికారి రమేష్ వివరించారు. స్వచ్ఛమైన నీరు అందించి ప్రజల యొక్క ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ఈ పరికరం పనిచేస్తుందని గ్రామాలలో ప్రజలకు ప్రతి రోజు, మంచినీరు అందించే కార్యక్రమం పై సమీక్ష నిర్వహించుకోవాలని ఎంపీడీవో కార్యదర్శులను కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉబ్బన రఘు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకంలో విద్యుత్ పరికరాలు చోరీ

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామంలో ఎత్తిపోతల పథకంలో విద్యుత్ పరికరాలు చోరీకి గురి అయినట్లు ఎత్తిపోతల పథకం చైర్మన్ తలపురెడ్డి అనిమిరెడ్డి తెలిపారు. మోటార్ వైర్లు, విద్యుత్ మోటార్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, పైపులు, విలువైన సామాగ్రి రూ. రెండున్నర లక్షల విలువైన సామాగ్రి చోరి కి గురైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆయకట్టు పరిధిలో 7500 ఎకరాలు 300 మంది రైతులు దీని పరిధిలో ప్రతి సంవత్సరం వరి సాగు చేసుకుంటున్నారని ఎవరో దుండగులు పరికరాలను చోరీకి గురి చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .ఈ విషయమై సంబంధిత శాఖ అధికారి ప్రసాద్‌కు, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని రైతులు పేర్కొన్నారు. విచారించి న్యాయం చేయాలని రైతులు కల్లూరు ఎస్సై ను కోరుతున్నారు.

# నాసిరకంగా సిసి రోడ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని మద్దులపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణం నాసిరకంగా కొనసాగుతుందని నాణ్యత కరువైందని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జాల శ్రీను యాదవ్ ఆరోపించారు. బుధవారం ఆయన మద్దులపల్లి గ్రామంలో నిర్మిస్తున్న సిసి రోడ్లను పరిశీలించారు. పిఆర్ఏఈ సిసి రోడ్ల నిర్మాణం వద్ద ఉండకుండా పర్యవేక్షణ చేయకుండా కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారని, పది కాలాలపాటు మన్నికగా ఉండాల్సిన సిసి రోడ్ల నిర్మాణంలో స్థానిక వాగుల వద్ద ఉన్న ఇసుక తీసుకొచ్చి సిసి రోడ్లలో వాడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పిఆర్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుండా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. దీనిపై పిఆర్ఏఈ వాసును వివరణ కోరగా తాను ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో మీటింగ్‌లో ఉన్నానని, తర్వాత మాట్లాడతానని తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కోటి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గా మార్తి కోటి ని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మార్తి కోటి మాట్లాడారు. మండలం లో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రామ స్తాయి నుంచి గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో యూత్ కాంగ్రెస్ సత్తా చాటేందుకు కార్యకర్తలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. తన పై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి ని ఇచ్చినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని పేర్కోన్నారు.ప్రభుత్వ పధకాలను ప్రజలలోకి తీసుకెళ్లేలా యూత్ కాంగ్రెస్ కార్యచరణ ను రూపొందించనున్నట్లు పేర్కోన్నారు. తన కు పదవి ఇచ్చినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులు కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నేలకొండపల్లి మండల నాయకులు పలువురు అభినందించారు.

## అంకమ్మ జాతరలో బోనాల సందడి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని చెరువుమాధారం లో శ్రీ అంకమ్మ జాతర లో బుదవారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం కు వచ్చిన భక్తులతో కిటకిటాలాడింది. అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించారు. యువత, ఆటా, పాటలతో సందడి చేశారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి జాతర ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంకమ్మ జాతర లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాద్రి రామాలయం హుండీ ఆదాయం రూ.74 లక్షళ 79 వేల 341 రూపాయలు సమకూరింది. బుధవారం హుండీలు తెరిచిన అధికారులు భక్తులు సమర్పించిన సొమ్ము మొత్తాన్ని లెక్కించి ఎస్‌బిఐ లో జమ చేశారు. హుండీల ద్వారా రూ.71 లక్ష22 వేల 878 రాగా, అన్నదానం నిమిత్తం రూ.1లక్ష61 వేల 100 అందాయి. గోషాల ద్వారా రూ.1లక్ష95 వేల 341లు వచ్చాయి. వీటితో పాటు యూస్ డాలర్లు 270, కెనాడ డాలర్లు 50, మలేషియా రింగిట్స్ 20, వివేనాన్ డాంగ్స్ 2000 వచ్చాయి.ఫిబ్రవరి 29న చివరి సారిగా హుండీ లెక్కింపు జరిగింది. తిరిగి మార్చి 27 మరో సారి లెక్కించారు. కేవలం 27 రోజులకే ఆలయానికి భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది.

## రామాలయానికి రెండు జంబో కూలర్లు వితరణ



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయానికి స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ తరుపున రెండు జంబో కూలర్లను బుధవారం వితరణగా అందజేశారు. ఈ కూలర్లను రామలాయం ఇఓ ఎల్ రమాదేవికి అందజేశారు. భక్తుల సౌకర్యార్థం కూలర్లను అందించిన ఎస్‌బిఐ బ్రాంచ్ వారిని ఆమె అభినందించారు. అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## గడువు లోగా సిఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వం సూచించిన గడువు లోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సిఎంఆర్ లక్ష్యాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిఎంఆర్ 2023 24 సంవత్సర లక్ష్యాన్ని ప్రభుత్వం సూచించిన గడువు లోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లక్ష్యం సాధించని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో 223 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో 152, ఐకెపి ఆధ్వర్యంలో 42, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 30 కేంద్రాలను ఏప్రిల్ ఒకటిన ఏర్పాటు చేయడం కోసం అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత కేంద్రాలలో మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్స్, గోనె సంచులు, వెయింగ్ మిషన్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం సూచించిన తేమ శాతం మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ద్వారా ప్రారంభోత్సవాలు చేయకూడదని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. ప్రతి కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఐకెపి, సహకార శాఖ, హార్టికల్చర్ సంబంధిత అధికారులు బృందంగా ఏర్పడి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేయడంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, డిఎం సివిల్ సప్లయ్ శ్రీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ అమల్లోనూ మద్యం దందా..!

**-విచ్చలవిడిగా బెల్ట్‌షాపులకు అధిక ధరలకు విక్రయాలు**
**- మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ**





ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో రిజర్వేషన్ ప్రాతిపదికన మద్యం వ్యాపారులు లాటరీ పద్ధతిలో వైన్‌షాపులను పొందిన వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పేదలవాడి కాయ కష్టాన్ని దోచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా మద్యం వ్యాపారాలు ఇదే అదునుగా భావించి విచ్చలవిడిగా బెల్ట్‌షాపులకు మద్యాన్ని విక్రయిస్తూ దళారికి పాల్పడుతున్నారు. దీనంతటికీ కారణం ఎక్సైజ్‌శాఖ వ్యాపారుల నుంచి నెలవారి వసూళ్లకు పాల్పడుతన్నట్లు ప్రజల ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మద్యం వ్యాపారుల వద్ద పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులు బెల్ట్‌షాపుల వద్దకు వెళ్లి మేము ఎక్సైజ్‌శాఖ సంబంధించిన వారివని మహిళలను బెదిరించి వారి ఇంట్లో ఉన్న మద్యాన్ని దౌర్జన్యంగా తీసుకొస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు చేయవలసిన పనిని ప్రైవేట్ వ్యక్తులు చేస్తుంటే అధికారులు సోద్యం చూస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40గ్రామ పంచాయతీలు ఉండగా అప్పటి ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన మొత్తం ఐదు వైన్‌షాపులను మంజూరు చేసింది అప్పటి ఎక్సైజ్ అధికారులతో కుదిరించుకున్న ఒప్పందంతో మద్యం వ్యాపారులు ఐదు షాపులకు గాను మూడు షాపుల్లో కౌంటర్లు తెరిచి మద్యాన్ని బెల్ట్‌షాపులకు విక్రయిస్తూ కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం తిరుమలాయపాలెం పిండిప్రోలు దమ్మాయిగూడెం గ్రామంల్లో మూడు షాపులు ఉంటే సరిపోతుంది కానీ మిగతా రెండు షాపులు కూడా దమ్మాయిగూడెం తిరుమలాయపాలెం షాపులలో కౌంటర్లు తెరిచి బెల్ట్‌షాపులకు ఎనక కౌంటర్లో కోటకు 12రూపాయలు చొప్పున ఎక్కువ ధరకు మద్యం బాటిల్ విక్రయిస్తున్నారు. వైన్‌షాప్ దగ్గరకు వచ్చిన కస్టమర్లకు ఎమ్మార్పీ ధరకు ఇచ్చే ముందు కౌంటర్లో మద్యం ప్రియులు అడిగిన మద్యం దొరక్కుండా ఎనక కౌంటర్లో బెల్ట్‌షాపులకు వారు కోరిన మదాయన్ని విక్రయిస్తూ బెల్ట్‌షాపు వారు కొనుగోలు చేసిన మద్యాన్ని బెల్ట్‌షాపుల్లో మద్యాన్ని మందుబాబులు విక్రయించేలాగా ప్రోత్సహిస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో ప్రతి క్వాటర్,బీరుపై 30రూపాయలు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ రేటుకి విక్రయిస్తున్నారు. గ్రామల్లో బెల్ట్‌షాపులు గుడికి బడికి అతి దగ్గరలో ఏర్పాటు చేసుకొని మద్యాన్ని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంచుతున్నారు. సుప్రీంకోర్టు ఉత్తరాలను ఎక్సైజ్‌శాఖ మరిచింది ప్రధానం రహదారికి సుమారు 500మీటర్ల దూరంలో ఉండవలసిన మద్యం బెల్ట్‌షాపులలో మాద్యాన్ని సేవించి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలో 9వ తరగతి విద్యార్థి నుంచి పండు ముసలి వరకు ఎప్పుడంటే అప్పుడు కొనుక్కొని మదాయనికి బానిస అవుతున్నారు. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం బెల్ట్‌షాపులను అరికడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది కానీ ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులతో సిండికేంట్ కుదిరించుకొని ఎన్నికల కోడ్ సైతం పట్టించుకోకుండా బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్‌షాపులను అరికట్టాలని మూడు కౌంటర్‌లో ఉన్న ఐదు శాఖలను మిగతా గ్రామాలకు తరలించాలని స్థానిక ప్రజలు ప్రజాప్రతనిధులు కోరుతున్నారు.

## మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే సహించేది లేదు..

**-టియూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో అధికారులకు వినతి**



ప్రజాపక్షం/భద్రాచలం : మీడియా స్వేచ్ఛకు, పాత్రికేయుల హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి. రమణారెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి మొబగాపు ఆనంద్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి అన్నారు. ఈ మేరకు బుధవారం ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్, ఆర్‌డిఓ దామోదర్‌లతో పాటు ఏఎస్‌పి కార్యాలయంలో వినతి పత్రాన్ని సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమాల వ్యవహారంలో కవరేజీకి వెళ్లిన మీడియాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, చర్లలో అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేసి, ఇసుక రీచ్‌లలోకి మీడియా రావద్దంటూ అల్టిమేటం జారీ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మీడియా హక్కులపై భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు దశలవారీగా ఉద్యం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు పిల్లి రాజు, పందా సత్యానంద్, ఎర్రంశెట్టి కృష్ణ, రాజాకిరణ్, నర్సింహనాయుడు, సతీష్, దుర్గారెడ్డి, తమ్మళ్ల రాజేష్, బాలాకిరణ్, వాసు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం

**-14వ వేతన ఎన్నికలు నిర్వహించాలని లేబర్ కమిషనర్‌కి ఛాలెంజ్ లెటర్**



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటిసి పిఎస్‌పిడి భద్రాచలం యూనిట్ సారపాక నందు గత గుర్తింపు సంఘం రికగ్నైజ్ పిరియడ్ 5 జులై 2023తో ముగిసిందని, కావున గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని బుధవారం బిఆర్‌టియూ, సిఐటియూ, ఐఈయూ యూనియన్ల ఆధ్వర్యంలో లేబర్ కమీషనర్ హైదరాబాద్‌కి, జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ వరంగల్ సునీతకి, డిసిఎల్ ఖమ్మం రమేష్‌బాబుకి ఛాలెంజ్ లెటర్ అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 13వ వేతన ఒప్పందం ఎన్నికలు 3మే 2021 జరగగా పరిశ్రమ నందు ఎన్నికల్లో గెలిచిన యూనియన్ వారు 5 జులై 2021తేదీన రికగ్నైజేషన్ తీసుకొని 5 జులై 2023తో రెండు సంవత్సరాలు గుర్తింపు సంఘం కాల పరిమితి ముగిసిందని ఎన్నికలు నిర్వహించాలని కమిషనర్‌ని కోరారు. ఈ 13వ వేతన ఒప్పందంలో గత ఏ వేతన ఒప్పందాలలో లేని విధంగా టిఎన్‌టియూసి యూనియన్ ఆన్ టైం అగ్రిమెంట్ పేరుతో వేతన ఒప్పందాన్ని పూర్తి చేస్తూ ప్రాస్పక్టివ్ వేతన ఒప్పందాలకు నాంది పలకిందని, ఫలితంగా వేతన ఒప్పందాలు ఇన్ టైం పిరియడ్‌లో జరగకపోతే తర్వాత రావాలసిన ఏరియల్స్‌ను యాజమాన్యం కార్మికులకు చెల్లందన్నారు. ఫలితంగా కార్మికులు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మంచి వేతనాలు, కార్మికుల భద్రతతో కూడిన సంక్షేమం, అన్ని వసతులతో కూడిన మెడికల్ స్కీం, కార్మికుల ఉజ్వల భవిష్యత్తు, భవిష్యత్తులో రాబోయే యువ భావి తరాలకు భరోసా, మంచి పర్మినెంట్ పాలసీ వీటన్నిటితో కూడిన అద్భుతమైన వేతన ఒప్పందాన్ని కార్మికులకు అందిస్తామని మన సూర్ఫిగా తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## పూట గడవని స్థితిలో ఆటో డ్రైవర్లు..!

**ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల వేడుకోలు**



ప్రజాపక్షం/సుజాతనగర్: పూట గడవని స్థితిలో అప్పుల్లో కూరుకుపోయి ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేల సంఖ్యలో ఆటోలు ఉన్నాయి. వీటిపై డ్రైవర్లు ఓనర్లు కలిసి పగలు, రాత్రులు ఆటోలు నడిపి తమ జీవనం కొనసాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆటో నడవడం జీవనాధారంగా పెట్టుకొని సుమారు 30 సంవత్సరాల నుండి కూడా ఆటో నడుపుతూ కుటుంబాలను వెల్లదీసుకునే వారు చాలామంది ఉన్నారు. డిగ్రీలు, పీజీలు టెక్నికల్ గా ఎన్నో కోర్సులు చదివి నేర్చుకుని ఉద్యోగం దొరకగా ఆటో నడుపుతూ స్వయం ఉపాధిగా గడుపుతున్న వారు వందలాదిమంది ఉన్నారని చెప్పవచ్చు. నిత్యం గ్రామీణ ప్రాంతంలో అర్ధరాత్రి ఆరోగ్యం బాగా లేకపోయినా ఏ కష్టం వచ్చినా పట్టణానికి రావాల్సి వస్తే ముందుగా గుర్తుకు వచ్చేది ఆటో మాత్రమే. గతంలో కంటే పెరిగిన ఇన్సూరెన్స్, డీజిల్, ఆటో విడిభాగాల రేట్లు, లైసెన్స్ చార్జీలు, ఫైనాన్స్ ఆఫీసుల చార్జీల ధరలు, వేధింపులు, పోలీసుల చలానాలతో ఆటో డ్రైవర్ల జీవితం దుర్భరంగా తయారైంది. ఇంట్లో బంగారం, భార్య పుస్తెలతాడు తాకట్టుపెట్టి కొంత డబ్బు కట్టి ఫైనాన్స్ ద్వారా ఆటో కొనుక్కొని కిరాయిలు చేసి కుటుంబాన్ని పోషించుకుందాం అనుకున్న వారు కిరాయిలు లేక, ఫైనాన్సులు కట్టలేక, అప్పుల బాధ భరించలేక చాలామంది చివరికి ఆటోలను ఆ ఫైనాన్స్ ఆఫీసులకు వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు రోజంతా పట్టణాలలో గ్రామాలలో ప్రయాణికులు ఎక్కించుకొని ట్రిప్పులు వేసినా డీజిల్‌కు పోను మిగిలేది సుమారు 500 రూపాయలు వరకు మాత్రమే. అందులో ఆటో ఓనర్ కి 300 ఇస్తే మిగిలేది 200 రూపాయలు వరకు ఆటో డ్రైవర్ కు మిగులుతుంది. దీంతో ఇంటి అద్దె పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ పోషణ చాలా కష్టంగా మారి ఆటో డ్రైవర్ ఆత్మహత్యలే దిక్కు అన్నట్లుగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ప్రతి మండల కేంద్రం నుండి వేరే చోటుకు వెళ్లడానికి తప్పనిసరిగా బస్సు ప్రయాణం చేస్తున్నారు. దానికి తోడు చాలా మంది ద్విచక్ర వాహనాలు, కార్లు ఇలా సొంత వాహనాలు ఉపయోగించడంతో ఆటోలను ఉపయోగించేవారు తక్కువగా కనిపిస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఆటో నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల పరిస్థితి దిక్కుతోచని పరిస్థితిలో అగోమ్యాచారంగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని ఆటో డ్రైవర్ల పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లు ను ఆర్థికంగా ఆదుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో ప్రకటించిన ప్రతి డ్రైవర్ కు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఆర్థిక సహాయ విధానం వెంటనే అమలు చేయాలని, అదే విధంగా ప్రతి సంవత్సరం ఇన్సూరెన్స్ కూడా ప్రభుత్వమే చెల్లించాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డీజిల్, పెట్రోల్ ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని, 50 సంవత్సరాల నిండిన ప్రతి డ్రైవర్ కు 5000 పెన్షన్ అందించాలని, ప్రభుత్వం అందిస్తున్న 6 గ్యారంటీల పథకాలలో 25% ఆటో డ్రైవర్ కుటుంబాలకు కేటాయించాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.

**సంవత్సరానికి రూ.1200 ఆర్థికసాయం అందించాలి : వీర్ల మల్లేష్, ఆటో యూనియన్ మండల అధ్యక్షులు**



ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి 1200 రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఆటో డ్రైవర్ కు 5000 రూపాయలు అందించాలి.

## కల్లూరు బస్టాండ్‌లో కూలింగ్ మినరల్ వాటర్ ప్రారంభం



ప్రజాపక్షం/కల్లూరు: ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి అన్నివేళలా అందుబాటులో మంచినీళ్లు వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కల్లూరు బస్టాండ్ లో ఏర్పాటు చేసిన చల్లని మినరల్ వాటర్ చలివేంద్రమును బుధవారం సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలల పాటు చల్లని మినరల్ వాటర్ అందించేందుకు ముందుకు వచ్చిన దాత ఆళ్లకుంట నరసింహారావు ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. మూడు నెలలపాటు ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి తన సొంత ఖర్చులతో చల్లని మినరల్ వాటర్ అందించడం అభినందనీయమన్నారు. కల్లూరు ప్రాంత వాసులు ఆర్టీసీ ఏ కార్యక్రమం చేపట్టిన తన వంతు దాతృత్వాన్ని చాటుకునేందుకు ముందుంటున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కల్లూరు బస్టాండ్ లో ప్రతి సంవత్సరం ప్రయాణికులకు చల్లని మినరల్ వాటర్ అందించడానికి ముందుకు వస్తున్న దాతలను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. మూడు నెలల పాటు ఉచితంగా కూలింగ్ మినరల్ వాటర్ను అందిస్తున్న దాత ఆలకుంట నరసింహారావు దుశ్శాలువాతో డిపో మేనేజర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యనుమల రుక్మిణి, రాము, ఉస్మాన్, ధారా రంగ, కిషోర్ దత్తు, దామాల సురేష్, భాగం ప్రభాకర్, నోటి కృష్ణారెడ్డి, బాల, బొడ్డు ప్రసాదు, సాంబ తదితరులు పాల్గొన్నారు.


## పెంచిన టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలి

ప్రజాపక్షం/గుండాల : పెంచిన టెట్ పరీక్ష ఫీజులను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి ఎస్కె షాహెద్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్లతో షాహెద్ మాట్లాడుతూ నిరుద్యోగులకు పెనుబారంగా మారిందని , గతంలో ఒక పేపర్ రాస్తే 200వందలు, రెండుపేపర్లు రాస్తే 300వందలు ఉండేదని, ఇప్పుడు 1000 నుండి రెండువేలకు ఫీజులను పెంచడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ప్రవేశ పరీక్షల ఫీజులను తగ్గించి తక్కువ ఫీజులతో పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందని, అట్టి హామీకి విరుద్ధంగా టెట్ ఫీజును పెంచడం సరికాదన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులు టెట్ పరీక్షలకు సన్నద్ధమౌతున్నారని , ఇప్పటికే బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధిక ఫీజులు కట్టి కోచింగ్‌తీసుకొని పరీక్షల్లో అవకతవకలు కారణంగా నిరుద్యోగులు నష్టపోయారని , ఇప్పటిఇకైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పెంచిన టెట్ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

## దూలుగొండ జాతర ప్రారంభం

ప్రజాపక్షం/గుండాల : ఈసంవంశీయుల ఇలవేలుపుగా కొలుసుకునే దూలుగొండ తల్లి జాతరను ప్రతి సంవత్సరం హోళిపున్నమిలో బుధ,గురు, శుక్ర వారాల్లో మూడురోజుల పాటు గిరిజన సాంప్రదాయ ప్రకారం ఇ జాతరను ఘనంగా నిర్వహిస్తారు. నేడు బుధవారం రోజున గుడిమెలుగుట, గురువారం దేవతను గద్దెమీద ప్రతిష్ఠ జరపడం, శుక్రవారం దేవతకు మొక్కులు చెల్లించు కోవడం జరుగుతుందని , జాతర సందర్భంగా వాలీబాల్ క్రీడ

## మాజీ సర్పంచ్ సూర్యం దశదిన కర్మలకు హాజరైన జెడ్‌పిటిసి దంపతులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం(92) గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. కాగ బుధవారం దశదిన కర్మల సందర్భంగా జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, కామిరెడ్డి రామకొండా రెడ్డి దంపతులు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో జూలూరుపాడు జెడ్‌పిటిసి భూక్య కళావతి, అంజనాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బానోత్ శ్యామ్, మండల నాయకులు చేతుల పెద్దవీర్రాజు, చేతుల పెద్ద వెంకటరత్నం, తేజావత్ రామ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సాయి శ్రీను, పలువురు పార్టీ నాయకులు, స్థానిక గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై శిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఉపాధి హామీ పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదిన నందు బుధవారం ఏర్పాటు చేశారు. పిఆర్అండ్ ఆర్‌డి కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా సంయుక్త ఆదేశాలతో శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడివో జములారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపిడివో జములారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో బూర్గంపాడు, భద్రాచలం మండలం లోని పంచాయితీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ మెట్లు అందరికీ ఉపాధి హామీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. లేబర్ మొబిలైజేషన్, యావరేజ్ వేజ్, కూలీలకు గరిష్ట వేతనం రూ 272 వచ్చే విధంగా చూడాలని, పలు అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపివో సునీల్ శర్మ, ఏపీవో విజయలక్ష్మి, టిఏలు వెంకటలక్ష్మి, స్వాతి, వెంకట్, ములకలపల్లి ఏపీవో హుస్సేన్, భద్రాచలం ఏపీవో అపర్ణ, టిఏలు, అన్ని గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పంచాయితీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ మెట్లు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి కూలర్ వితరణ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా గ్రంధాలయ సంస్థకు పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బుధవారం ఎయిర్ కూలర్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దారా నగేష్, కార్యదర్శి జూలూరు ఆనంద్‌లు తమ బృంధంతో కలిసి గ్రంధాలయానికి చేరుకుని కూలర్‌ను ఇచ్చారు. ఈ సందర్భంగ గ్రంధపాలకురాళ్లు డి.వరలక్ష్మి దేవి, జి.మణిమృధుల మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు సౌకర్యంగా చదువుకునేందుకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కూలర్‌లు వితరణ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్రుల రుషి కుమార్, మేడ గణేష్, కొయ్యాడ నగేష్, కొదుమూరి సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాలపై చిన్న చూపు

**-ఏళ్లు గడుస్తున్నా పెరగని కాస్మోటిక్ మెస్ ఛార్జీలు**
**-ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ 14 ఏళ్లుగా కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం లేదని నెలకు బాలికలకు రూ. 75, బాలురకు రూ. 50 మాత్రమే చెల్లిస్తుందన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఐదేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలుపగా ఇప్పటికీ అమలు కాలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులపై ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు తప్ప వారి సంక్షేమం కోసం కృషి చేయడం లేదన్నారు. మెస్ ఛార్జీలు పెంచాలని గత ప్రభుత్వంలోని మంత్రుల బృందం 2023 మార్చిలో నిర్ణయించగా ఇప్పటి వరకు ఆమోదం పొందలేదన్నారు. మూడు నుంచి ఏడవ తరగతి విద్యార్థులకు రూ. 1200, ఎనిమిది నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1400, ఇంటర్, పిజి విద్యార్థులకు రూ. 1875ల చొప్పున ఇవ్వాలని మంత్రి వర్గ ఉప సంఘం సూచించిన నివేదిక అటకెక్కడంతో పాత మెస్ ఛార్జీలు అమలవుతున్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెను అందడం లేదన్నారు. వెంటనే మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పవన్, అయ్యప్ప, రాకేష్, రోషన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి పంచాయితీలో గల కుమ్మరిపాడు గ్రామంలో పలు శుభకార్యాల్లో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా శుభకార్యాలల్లో పలువురిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోండి

**- జిల్లాని అన్ని ప్రాంతాలు ఆకస్మికంగా తనిఖీ చేస్తా**
**- జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వేసవి కాలంలో ప్రతీ ఇంటికీ తాగు నీరు అందేలా చర్యల తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, మిషన్ భగీరథ ఇఇలు, డిఇలు, పబ్లిక్ హెల్త్ డిఇలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ప్రత్యేకాధికారులతో తాగునీరు, పనుల పురోగతిపై టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి యద్దడి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రతీ ఇంటికీ నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో ఎండల తీవ్ర అధికంగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, రాబోయే మూడు నెలల్లో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరందేలా చూడాలని అన్నారు. నీటి వసతి ఉందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలు, చేతి పంపులు, బోర్‌వెల్, మిషన్ భగీరథ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. అవసరమైన మరమ్మత్తులు త్వరగా చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్లు తమ పరిధిలో ఉన్న నీటి సరఫర ప్రాంతాలను ప్రతీ రోజూ విధిగా తనిఖీ చేయాలని చెప్పారు. అవసరం ఉన్న చోట బోర్‌వెల్స్ అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు సరిపోకపోతే నేరుగా సరఫరా చేయాలని ఆ అధికారులను ఆదేశించారు. అనంతరం పనుల పురోగతి, పూర్తయిన పనుల వివరాలు వివరంగా నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా అన్ని మండలాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, ఎటువంటి పొరపాట్లు లేకుండా ముందుగానే తాగునీటి సరఫరా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ టెలీకాన్ఫిరెన్స్‌లో అదనపు కలెక్టర్ విద్యా చందన, మిషన్ భగీరథ ఇఇ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## గల్లీ గల్లీకి సిసి రోడ్లు వేయించడమే కాంగ్రెస్ లక్ష్యం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే రాదాస్‌నాయక్ ద్వారా వచ్చిన ఈజిఎస్ రోడ్లు సుమారు రూ.40లక్షలతో నిర్మాణం జరుగుతున్నాయి. రోడ్ల నిర్మాణం చేపడుతున్న క్రమంలో జిపి వాటర్ పైప్‌లైన్‌లు, డ్యామేజ్ కావడంతో ముందు జాగ్రత్తగా సంబంధిత కాంట్రాక్టర్స్ పంచాయతీ అధికారులకు ఇంటిమేషన్‌తో పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం 3 నెలల సమయంలోనే గ్రామానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవతో రూ.40లక్షల నిధులు మంజూరై త్వరత్వరగా పనులు కూడా జరుగుతున్నాయి అని ఇమ్మడి అన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో ప్రతి మట్టి రోడ్డు సిసి వేసేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు తోగరా శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ పూడిక మట్టికి అనుమతులివ్వాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్‌తో పాటు ఇతర చెరువులు నుంచి పూడిక మట్టి సాగు భూముల్లో తోలుటకు సత్వర అనుమతులు మంజూరు చేయాలని, ఎకరాకు వంద ట్రాక్టర్ ట్రిప్పులు అనుమతి ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైరా ఇరి గేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలం గాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువులు, కుంటలు పూడిక తీసి జేసిబి ఖర్చు ప్రభుత్వం భరించి రైతులు సాగు భూములకు సాంద్రమైన మట్టి తరలింపు జరిగిందని అన్నారు. నూతన ప్రభుత్వం కూడా జేసిబి ఖర్చు భరించి తక్కువ ఖర్చుతో రైతులు పంట పొలాల్లో చెరువులు, కుంటలు నుంచి మట్టి తరలింపుకు సహాయం అందించాలని కోరారు. ఎకరానికి నలబై, ఏభై ట్రాక్టర్ ట్రిప్పులు కూడా వంద ట్రాక్టర్ ట్రిప్పులకు అవకాశం కల్పించాలని, జిల్లాలో అన్ని చెరువుల్లో నీరు అందుబాటులో లేకుండా పోయిందని, సాంద్రమైన మట్టి తరలింపుకు అవకాశం ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, చిత్తారు మురళి, వడ్లమూడి మధు, కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి సహకార పరపతి సంఘం సీతారాంపురం గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య, కారేపల్లి మండల బిసి సెల్ అధ్యక్షులు బోళ్ళ రమేష్ బుధవారం వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన రోశయ్య సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోతు రామ్మూర్తినాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రోశయ్యకు కాంగ్రెస్ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# చెక్‌డ్యాం ఆక్రమణపై అధికారులకు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంచుకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 338లో గతంలో చెక్‌డ్యాం నిర్మాణం జరిగిందని అట్టి చెక్‌డ్యాంను కూల్చి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయం, ఆర్డివో కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. చెక్ డ్యాం ఉండడం వల్ల బోర్లలో గ్రౌండ్ వాటర్, ఎండాకాలం పశువులకు నీళ్లు, పంటల సాగుకు నీళ్లు ఇలా అనేక విధాలా ఉపయోగపడేదని రైతులు తెలిపారు. చెక్‌డ్యాంను కూల్చి ఎటువంటి ఆధారం లేకుండా చేశారని రైతులు వాపోయారు. ఇదేమని అడిగితే కొంత మంది రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రైతులు తెలిపారు. సాదాబైనామా సమయంలో దొంగతనంగా పాసు బుక్కుల్లో ఎక్కించుకున్నారని ఇక్కడ చెక్ డ్యాం లేదంటూ రైతులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి చెక్ డ్యాం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రజలకు అందించిన సేవల ఫలితమే ఎమ్మెల్యే పదవి

**-నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండే నాయకునికే ప్రజాదరణ**
**-ప్రజల నమ్మకానికి అనుగుణంగా అభివృద్ధికి బాటలు**
**-ఆత్మీయ సమ్మేళన సభలో ఎమ్మెల్యే కూనంనేని**





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఐదు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అందించిన సేవల ఫలితంగానే తనని ఎమ్మెల్యేగా ఎన్నుకొని చట్టసభకు పంపారని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ హమాలీ కాలనీలో గ్రామ పరిధిలో ప్రజలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సభలో కూనంనేని మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ప్రజాదరణ లభిస్తుందని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయని అన్నారు. అహంకారంతో విర్రవీగే నాయకుడిని, ప్రజాప్రతినిధి జనం ఆదరించారని అన్నారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల కోసమే పుట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకున్నా యావత్ కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షమే వహిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ప్రజా సమస్యలకు పరిష్కారం కోసం అనునిత్యం శ్రమిస్తానని, నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే విషయంలో అధికార పార్టీ పైన పోరాడేందుకు వెనుకాడబోనని పునరుద్ఘాటించారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో మునుపెన్నడూ లేనివిధంగా వంద రోజుల్లోనే రూ.5కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు కనీస మౌళిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలు కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషాను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎలుక రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సారయ్య, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బంధం నాగయ్య, నాయకులు బాతుల సురేష్, పల్నాటి ప్రశాంత్, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీల్లో రూ. 9.50 లక్షలు పట్టివేత



**ప్రజాపక్షం/సుజాతనగర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సూచనలతో సుజాతనగర్ మండలంలో పిఎస్. ఎస్.హెచ్.ఓ. షేక్ జుబేదా తన టీం తో పాటు వాహనాలు తనిఖీలు బుధవారం నిర్వహించారు. జూలూరుపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి దగ్గర రూ. 9.50 లక్షల నగదుకు ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందని ఎస్ కె. జుబేదా తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా కోడ్ విధించి కొన్ని నిబంధనలు ఈసీ ప్రకటించిందని ఈ క్రమంలో అక్రమ మద్యం, డబ్బుని అరికట్టే ప్రయత్నంలో నాతోపాటు నా టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా రూ. 9.50 లక్షలు పట్టుకున్నామని నిబంధనలో ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జుబేదా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో యువకుల హల్‌చల్

**-స్థానిక దుకాణదారులపై దాడి**
**-దేహశుద్ధి చేసిన గ్రామస్తులు**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మద్యం మత్తులో యువకులు హల్ చల్ చేసి, పలువురు దుకాణం దారులపై, పోలీస్ సిబ్బందిపై సైతం దాడి చేసిన ఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈవిషయంపై పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడు మండలానికి చెందిన ఐదుగురు యువకులు అయ్యన్నపాలెంలోని ఓ ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లోని టిఫిన్ సెంటర్‌లో పానీపూరి తిని డబ్బులు చెల్లించకపోవడంతో దుకాణదారుడు డబ్బులు ఇవ్వాలని అడగ్గా వెంటనే ఆ ఐదుగురు యువకులు అతనిపై దాడి చేశారు. అడ్డుకోబోయిన స్థానికులపై, ఇతర దుకాణదారులపై పలుమార్లు దాడులు చేశారు. దీంతో ప్రతిఘటించిన యువకులు, స్థానికులు సదరు మందు బాబులకు దేహశుద్ధి చేశారు. ఈవిషయం పోలీసులకు తెలియటంతో మద్యం మత్తులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకునే క్రమంలో ఇద్దరు కానిస్టేబుల్స్‌పై సైతం దాడి చేసినట్లు సమాచారం. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామస్తులకు ఎస్‌ఐ మాచినేని రవి సర్ది చెప్పి అక్కడ నుంచి పంపించారు. మద్యం మత్తులో వీరంగం చేసిన యువకులపై చట్టపరంగా కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.


# రైస్ మిల్లర్ల యజమానులపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** పిడిఎఫ్ బియ్యం సకాలంలో అందించడం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చంద్రుగొండ ప్రధాన రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి పిడిఎఫ్ బియ్యాన్ని అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. అనంతరం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చంద్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల అధికారులను ఆదేశించారు. వికలాంగులకు అసౌకర్యాలు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచన చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపిడివో అశోక్, ఏవో వినయ్, ఆర్ఐ అక్బర్ తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ ఆంక్షలు తూచ్..!

**-అస్తవ్యస్తంగా రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్న వైనం**
**-ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనచోదకులు**





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరని విధంగా ఉంది. విద్యాసంస్థలు, సినిమా హాలు, వివిశ రకాల వాహన విక్రయ కేంద్రాలు, రిపేరింగ్ సెంటర్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం సాయంకాల సమయాలను పాఠశాలలకు వెళ్లు విద్యార్థులు, ఉద్యోగరీత్యా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగస్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న రైతు బజార్ నందు వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది. పట్టణ గ్రామీణ ప్రాంతాలతో పాటు ఇతర మండలాల నుండి సైతం ప్రజలు అధికంగానే వస్తుంటారు. భారీ వాహనాలు ఉండడం వలన రహదారి ఎప్పుడు రద్దీగానే ఉంటుంది. వాహనచోదకులు అనేక రకాల ఇక్కట్లకు గురవుతున్నారు. కొంతమంది వాహనదారులు వాహనాలను రోడ్డపైనే వదిలి వెళుతున్న సంఘటనలు అనునిత్యం ట్రాఫిక్ ఆంక్షలు అంటూ జరిమానాలు విధిస్తూ వాహనచోదకులపై భారం మోపుతున్న ట్రాఫిక్ పోలీసులు రైతు బజార్ నందు వారి దృష్టి సారించడం లేదు. ప్రధాన రహదారితో పాటు మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై నిలిపే వాహనదారులకు సైతం కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన కల్పించాలని పాదచారుల మాటగా ఉంది. ఇటు విద్యార్థులు అటు ఉద్యోగస్థులు రోజువారి కూలీలు ఈ ట్రాఫిక్ వలన ఇబ్బందులు పడుతున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న కొత్తగూడెం జిల్లా కేంద్రానికి ఈ ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకొని ఉదయం సాయంకాల సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో సత్తుపల్లి ఎంఎల్‌ఏ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ, భక్తజన సందోహం నడుమ ప్రతిష్టా మహోత్సవాన్ని అంగ రంగ వైభవంగా జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్‌ఏ ప్రారంభించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో సీతారాముల వారి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా అష్టలక్ష్మి పూజా కార్యక్రమంలో ఎంఎల్‌ఏ రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయిలూరి బాబు, అన్నెం కోటిరెడ్డి, ఎంపిటిసి అన్నెం కళావతి, ఉప్పెర్ల రామారావు, పోతురాజు కోటయ్య, ఏరువ గోపాలరావు, గంటాల వెంకటాచారి, రావూరి రవిప్రసాద్, తాతా భాస్కర్‌రావు, గోవిందు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.